సాక్షి చిత్తూరు

సోమవారం । 22 । మే । 2023



ఈదురుగాలుల బీభత్సం

సదుం, రొంపిచెర్ల మండలాల్లో ఆదివారం ఈదురుగాలుల బీభత్సం సృష్టించడంతో మామిడి కాయలు నేలరాలాయి. –8లో



మంత్రి రోజాకు ఆహ్వానం

పుత్తూరులోని కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి రోజాను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. –10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	26
తిరుపతి	40	27
తిరుమల	34	23
గూడూరు	41	29
నగరి	41	28

న్యూస్‌రీల్

కాణిపాకంలో పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో పోటెత్తారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఉదయం నుంచి భక్తులు స్వామివారి దర్శనార్థం తరలిరావడంతో క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులు స్వామివారి దర్శనం కల్పించారు.

నేడు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ రాక



డా.విజయకృష్ణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : హైదరాబాద్‌లో ఉండే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి సోమవారం చిత్తూరుకి విచ్చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఉండే అంబేడ్కర్ లెర్నర్స్ సపోర్ట్ సెంటర్ కో–ఆర్డినేటర్ మీరా సాహెబ్ ఆదివారం వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డైరెక్టర్ సోమవారం జిల్లా కేంద్రంలో ఉండే కేంద్రాన్ని పరిశీలిస్తారన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే స్పందనలో ప్రజలు తమ వినతులు అందజేయవచ్చన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో...

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని.. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

జనసంద్రంగా బోయకొండ



చౌడేపల్లె బోయకొండలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: కోరిన కోరికలు తీర్చే ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్త జన సంద్రంగా మారింది. ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రద్దీ కొనసాగింది. ఒక్కరోజే సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షల ఫలితాలు వెలువడడం, ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో బోయకొండకు యువత తరలి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబుచేసి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేసవి శిక్షణ శిబిరం తనిఖీ



వేసవి శిక్షణా శిబిరంలో పిల్లలతో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి లావణ్య

పలమనేరు: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి లావణ్య ఆదివారం తనిఖీ చేశారు. వేసవి శిక్షణలో భాగంగా పిల్లలకు ఈ కార్యక్రమం ఎంత మేరకు ఉపయుక్తంగా ఉందని పరిశీలించారు. శిక్షణకు పెద్దగా పిల్లలు రాకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ జరుగుతున్న పలు అంశాలపై మీడియా ద్వారా సక్రమంగా ప్రచారం చేయకపోవడంతో అనుకున్న మేర కార్యక్రమానికి పిల్లలు రావడం లేదని గమనించారు. ఇకపై ఇలాంటి పొరపాట్లు చేయరాదని స్థానిక లైబ్రేరియన్ హేమంత్‌కు సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హుల ముంగిట్లోకి తీసుకెళుతున్న వలంటీర్ల సేవలు గుర్తించి ప్రభుత్వం సత్కరిస్తోంది. వలంటీర్లకు వందనం పేరుతో ప్రతి ఏటా మూడు రకాల పురస్కారాలను అందిస్తోంది. అందులో భాగంగా సదుంలో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వలంటీర్లను సత్కరించారు. సొంత నిధులు వెచ్చించి వారికి దుస్తులను అందించడం మరో విశేషం.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు

సంక్షేమ సారథులు వలంటీర్లు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సదుంలో 1,444 మంది వలంటీర్లకు పురస్కారాలు
- సొంత నిధులతో దుస్తుల పంపిణీ
- వైఎస్సార్‌సీపీలో చేరిన కుప్పం టీడీపీ నేత

సదుం: వలంటీర్లు ప్రతి కుటుంబానికి సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 1444 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లకు సముచిత గౌరవం లభిస్తోందన్నారు. గత నాలుగేళ్లలో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి, వారికోసం ప్రభుత్వం రూ.800 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. ఈ ఏట జిల్లాలో రూ.8.6 కోట్లు, నియోజకవర్గంలో రూ.1.98 కోట్లు వలంటీర్లకు వందనం ద్వారా అందించినట్టు చెప్పారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. వర్షం పడినా, సెలవు అయినా, పండుగైనా 1వ తేదీ ఉదయాన్నే తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నారన్నారు. ఇలా సేవలు అందించే వ్యవస్థ దేశంలోనే ఎక్కడా లేదని తెలిపారు.

2.6 లక్షల మందికి ఉద్యోగాలు

బాబు వస్తే జాబు వస్తుందని మాజీ సీఎం చంద్రబాబు ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చాక రెండు లక్షల కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించారని మంత్రి గుర్తుచేశారు. కానీ సీఎం జగన్ ఏ హామీ ఇవ్వకనే 2.6 లక్షల మందికి సచివాలయ కార్యదర్శులుగా ఉద్యోగాలు అందించారని చెప్పారు. ఇందు కోసం సుమారు 26 లక్షల మంది పరీక్షకు హాజరవ్వడం రికార్డు అని, అయినా పారదర్శకంగా ఎంపికలు నిర్వహించి, ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా పారదర్శకంగా ఎంపిక చేశామని చెప్పారు. వలంటీర్లతో కలిపి సచివాలయ వ్యవస్థ ద్వారా 4 లక్షల మందికి ఉపాధి కల్పించినట్టు వెల్లడించారు.

సొంత నిధులతో దుస్తుల పంపిణీ

నియోజకవర్గంలోని అందరు వలంటీర్లకు మంత్రి తన సొంత నిధులతో దుస్తులు పంపిణీ చేశారు. సమావేశానికి ముందు వలంటీర్లతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు, టీటీడీ పాలమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ముడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్లు సుధీర్, అలీమ్‌బాషా, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి



సదుం: వలంటీర్లను సన్మానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వరదరాజు

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

వలంటీర్ల వ్యవస్థపై ప్రారంభంలో చంద్రబాబు దుష్ప్రచారం చేశారని మంత్రి పెద్దిరెడ్డి గుర్తు చేశారు. కానీ కరోనా సమయంలో బాబు, లోకేష్ హైదరాబాద్ విడిచి రాకపోయినా వలంటీర్లు ప్రాణాలను లెక్కచేయకుండా ప్రతి ఇంటికీ సేవలు అందించారని గుర్తు చేశారు. మళ్లీ చంద్రబాబు వలంటీర్లపై మక్కువ చూపుతున్నారని, దాన్ని ఎవరూ నమ్మడం లేదని చెప్పారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని సీఎం వలంటీర్ల ద్వారానే అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాలు మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలనుకుంటున్నారని, అందుకనుగుణంగా వలంటీర్లు పని చేయాలని చెప్పారు. సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. వలంటీర్లు అర్హులకు పథకాలను అందించడంతో పాటు, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని సూచించారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపడతారని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సాగు, తాగు నీటి కోసం మంత్రి పెద్దిరెడ్డి ప్రాజెక్టులు నిర్మిస్తుంటే చంద్రబాబు కేసులు వేసి అడ్డుకోవడం దుర్మార్గమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత

కుప్పం మున్సిపాలిటీలోని టీడీపీకి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వరదరాజులు ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు సైతం ఆకర్షితులవుతున్నారని, రానున్న ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



ఆలయ ఆవరణలో చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. అంతకు ముందు ఆలయంలో మూలవిరాట్‌ను వేకువ జామున సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి7.30 గంటల మధ్య చక్రతాళ్వార్ తోపాటు, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని ఊంజల్ మండపం వద్దకు వేంచేపు చేశారు. ఉత్సవర్లతో పాటు చక్రతాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వెండి జలపాత్రలో ఆవభృత స్నానం చేయించారు. భక్తులు చక్రస్నానాన్ని దర్శించి పునీతులయ్యారు. సాయంత్రం ఉభయ నాంచారులతో వేణుగోపాలుడు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7.30 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కంకణబట్టు గోపాలచారికి టీటీడీవారు అందించిన పట్టు వస్త్రాలను టీటీడీ అధికారులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు నారాయణదాసరి, కిరణ్ భట్టాచార్యులు, సుందరవరదాచార్యులు పాల్గొన్నారు.

నేడు పుష్పయాగం

ఆలయంలో సోమవారం పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకు యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల మధ్య పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

తిరుపతి కల్చరల్ : బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్లో ఏపీ బీసీ ఉద్యోగుల ఆత్మీయ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలు కులాల పేరిట విడిపోవడంతోనే న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నామని తెలిపారు. తెగించి పోరాడకపోతే బానిస బతుకులు తప్పవని హెచ్చరించారు. మండల్ కమిషన్, పార్లమెంటరీ కమిటీ చైర్మన్ నాచియప్ప తమ నివేదికల్లో బీసీల ఉద్యోగోన్నతులకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేశారన్నారు. కేంద్ర స్థాయిలో 54 లక్షల ఉద్యోగాలు ఉంటే అందులో బీసీలు కేవలం 7.5 లక్షల మంది మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఎన్‌సీసీ, మహిళా రిజర్వేషన్లకు లేని క్రిమీలేయర్ బీసీలకే ఎందుకు విధించారని ప్రశ్నించారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ తరహాలోనే బీసీ యాక్ట్ తీసుకురావాలన్నారు. కేంద్ర స్థాయిలో రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. బీసీల గొంతును పార్లమెంట్‌లో వినిపించేందుకే ఆర్.కృష్ణయ్య వంటి ఉద్యమకారుడిని రాజ్యసభకు ఎంపిక చేశారని వెల్లడించారు. బీసీల హక్కుల సాధనకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్ఓ శ్రీనివాసరావు, గుజ్జ కృష్ణ, భూపేష్ సాగర వేముల రామకృష్ణ, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముని బాలకుమార్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలియజేస్తున్న ఎంపీలు ఆర్ కృష్ణయ్య, గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 24వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు అధికారి నాగరాజు, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం తిరుమంజనం జరిపించనున్నట్లు వివరించారు.

ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న తులసీశ్వర రెడ్డి కుటుంబ సభ్యులు

యాదమరి: ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం మూలస్థానంలోని శ్రీదేవి, పెరుందేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయంలో అర్చక వేదపండితులు ఆగమ శాస్త్ర ప్రకారం పుట్ట మన్ను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కంకణాలు ధరించారు. అనంతరం విష్వక్సేనుడు మాడ వీధుల్లో విహరించి ముక్కోటి దేవతలను స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి ఆలయం, వాహన మండపం, మాడ వీధుల్లో చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఏర్పాట్లు చేశారు.

పట్టు వస్త్రాల సమర్పణ

స్వామివారి బ్రహ్మోత్సవాలలో స్వామివారికి మండలంలోని బుడితరెడ్డి పల్లెకు చెందిన దాత తులసీశ్వర రెడ్డి ఆదివారం సాయంత్రం స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నేడు ధ్వజారోహణం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి స్వామివారి చంద్రప్రభ వాహనంలో విహరించనున్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): మండలంలోని గరిగపల్లె వెంకటాపురంలో సాగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆఖరి ఘట్టం దుర్యోధన వధ ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ధర్మకర్తలు రాజేంద్రనాయుడు, నాగరాజునాయుడు ఆధ్వర్యంలో 19 రోజుల పాటు వార్షిక మహాభారత ఉత్సవాలు నేత్ర పర్వంగా నిర్వహించారు. దుర్యోధన పాత్రధారి దొరస్వామి, భీముడి పాత్రలో సత్య తమ అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆలయ ఆవరణంలో అన్నదానం కార్యక్రమంలో నిర్వహించారు.

రాత్రి అగ్నిగుండ ప్రవేశం

మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్ని గుండ ప్రవేశం నిర్వహించారు. మొక్కులున్న కంకణధారులు పసుపు దుస్తులు ధరించి, వేపాకు చేతపట్టి గోవింద నామస్మరణలతో అగ్నిగుండ ప్రవేశం చేపట్టారు. ఈ క్రమంలో భాగంగా అమ్మవారిని ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు.



గరిగపల్లె వెంకటాపురం వద్ద నిర్వహిస్తున్న దుర్యోధన వధ సన్నివేశం

కూర్మం.. సాగర మర్మం!

సముద్ర సమతుల్యతను కాపాడడంలో తాబేళ్లు కీలక పాత్ర పోషిస్తుంటాయి. సాగర గర్భంలోని నాచు.. జెల్లీ ఫిష్‌లను తింటూ జీవనం సాగిస్తుంటాయి. తద్వారా మత్స్య సంపద సమృద్ధిగా పెరిగేందుకు దోహదపడుతుంటాయి. జీవవైవిధ్యానికి తోడ్పడే తాబేళ్లు ప్రస్తుతం అంతరించే స్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో అటవీ, వైల్డ్‌లైఫ్ అధికారులు కొన్నేళ్లుగా వీటి సంరక్షణ బాధ్యతలను చేపట్టారు. ఏటా వేలాది తాబేళ్లను విడతల వారీగా సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. సోమవారం ప్రపంచ తాబేళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మరిన్ని పరిరక్షణ చర్యలకు శ్రీకారం చుడుతున్నారు.

- సముద్ర సమతుల్యతలో కీలకం
- సంరక్షణకు చర్యలు చేపడుతున్న అటవీ, వైల్డ్‌లైఫ్ అధికారులు
- నేడు ప్రపంచ తాబేళ్ల దినోత్సవం

చిల్లకూరు : సముద్ర జలాల్లో తాబేళ్లు ఉన్నందున ఎన్నో మేళ్లు ఉంటాయని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. ఇటీవల కాలంలో పలు దేశాలలో తాబేలు మాంసం, పైన ఉన్న చిప్ప ఎముకలను వివిధ రకాల ఆయుర్వేద మందుల్లో వినియోగిస్తుండడంతో వీటికి గిరాకీ బాగా పెరిగింది. దీంతో ఎక్కడ పడితే అక్కడ తాబేళ్లను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనువైన ప్రాంతాల్లోనే..

బంగాళాఖాతంలో ఎక్కువగా జీవించే రకం ఆలీవ్ రిడ్లే తాబేళ్లు. ఇవి ప్రతి ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు గుడ్లు పెడతాయి, ఒక్కొక్కటి సుమారుగా 75 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంటాయి. వీటిని సంరక్షించే క్రమంలో భాగంగా అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు, చెన్నెకు చెందిన సీ ఫౌండేషన్ సంయుక్తంగా బాధ్యతలు చేపట్టి 2005 నుంచి జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలలో వాటిని సంరక్షిస్తున్నారు. గుడ్లను ఒక చోటకు చేర్చి పిల్లలు బయటకు వచ్చిన తర్వాత వాటిని సముద్రంలోకి పంపుతున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఇప్పటికే చిల్లకూరు, కోట, వాకాడు సముద్ర తీర ప్రాంతాలలోని తీగపాళెం, శ్రీనివాస సత్రం, నవాబుపేట నుంచి సుమారు 20 వేల తాబేలు పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అధికారులు చెబుతున్నారు.

ఐదు చోట్ల హేచరీలు

జిల్లాలో సముద్ర తీరం సుమారు 75 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ పరిధిలో చిల్లకూరు, కోట, వాకాడు, తడ నాలుగు మండలాలు ఉన్నప్పటికీ రెండు ప్రాంతాల్లో మాత్రమే తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు అనువుగా ఉంది. చిల్లకూరు మండలం, గుమ్మడిబ్బ, వాకాడు మండలం శ్రీనివాసపురం, నవాబుపేట, పూడి కుప్పం, వైట్ కుప్పంలో హేచరీలను ఏర్పాటు చేసి గుడ్లు పొదిగిస్తున్నారు. తాబేలు పిల్లలకు సూర్యోదయం అంటే ఎంతో ఇష్టం. అందుకే ఆ సమయంలోనే పిల్లలను సముద్రంలోకి వదులుతారు. సూర్యుని లేత కిరణాలు నీటిపై వాటికి బంగారు వర్ణంలో కనిపిస్తుండడంతో అవి నేరుగా నీటిలోకి వెళ్లిపోతాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

బాధ్యతగా కాపాడాలి

అంతరించి పోతున్న తాబేళ్లను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అలాగే నదులు, కాలువల్లో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలను వదలివేయకూడదు. ఇందుకోసం అందరూ నడుంబిగించాలని అధికారులు సూచిస్తున్నారు.

తాబేళ్ల రక్షణకు కృషి

తాబేళ్లను కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, ప్రస్తుత పరిస్థితిల్లో సముద్రంలోని వ్యర్థాల వల్ల తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని సైకతశిల్పి సనత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ తాబేళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని సముద్ర తీర ప్రాంతంలో సైకత శిల్పాలను రూపొందించారు. తాబేళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.



సముద్రంలోకి ఆలీవ్ రిడ్లే తాబేళ్లను వదులుతున్న అధికారులు



హేచరీలో బయటకు వచ్చిన తాబేలు పిల్లలు



సముద్ర తీరంలో పొదిగేందుకు సిద్ధం చేసిన తాబేలు గుడ్లు

రాత్రివేళల్లో కూడా సేకరిస్తాం



సముద్ర గస్తీ దళంలో 2012లో చేరా. అప్పటి నుంచి తాబేలు గుడ్లను సేకరిస్తున్నా. ఒక్కొక్కసారి అవి రాత్రివేళల్లో గుడ్లు పెడతాయి. అప్పుడు వాటిని గుర్తించి జాగ్రత్త చేయాల్సి వస్తుంది. లేకుంటే గుడ్లను సముద్రం మీద సంచరించే పక్షులు పొడుచుకుని తినేస్తాయి.

– జలీల్‌ఖాన్, నవాబుపేట, వాకాడు మండలం

20 వేల పిల్లలను వదిలాం



వాకాడు, చిల్లకూరు, కోట మండలాల్లోని సముద్ర తీరంలో ఈ ఏడాది సుమా రు 20 వేల తాబేలు పిల్లలను వదిలాం. ఉన్నతాధికారులు సైతం ప్రోత్సాహం అందిస్తున్నారు. ఐదు తీర ప్రాంతాలలో గుడ్లు పొదిగించే ఏర్పాట్లు చేస్తున్నాం. పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకుండా చర్యలు చేపడుతున్నాం. దీన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

– గాయం శ్రీనివాసులు, తమ్మినపట్నం సెక్షన్ అధికారి

కఠిన చర్యలు తప్పవు

సముద్రంలోని తాబేళ్లే కాదు, నదులు, చెరువుల్లో, బావుల్లో జీవించే తాబేళ్లను కూడా ఎవరైనా అక్రమంగా పట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. నేరం రుజువు అయితే 7 ఏళ్ల జైలుశిక్ష కూడా పడే అవకాశముంది. ప్రస్తుతం ఆలీవ్ రిడ్లే తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్నాం.

– సతీష్‌రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి, తిరుపతి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,665
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

పాము కాటుతో మహిళ మృతి

ఐరాల: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని 35 యర్లంపల్లెలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, వ్యవసాయ పనులు ముగించుకుని లక్ష్మమ్మ (65) ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు పాము కాటు వేసింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాడిఆవుల దొంగల అరెస్టు

పలమనేరు: మండలంలోని పలుచోట్ల పాడి ఆవుల చోరీలకు పాల్పడే దొంగలను పోలీసులు పట్టుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఈ మధ్య కాలంలో చిన్నపేట కురప్పల్లితోపాటు మొరం, కొలమాసనపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో పొలాలవద్ద, ఇళ్ల వద్దనున్న పాడిఆవులను కొందరు దొంగిలించి టెంపోలో తరలించి, వేరే ప్రాంతాల్లో అమ్మకాలు చేసిన విషయం తెలిసిందే. ఇదే రీతిలో ఎగువ కల్లాడు తదితర గ్రామాల్లో ఇటీవల పలు పశువులు చోరీ అయ్యాయి. ఈ చోరీలకు పాల్పడిన కొందరు దొంగలను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

బోల్తాపడిన ట్రాక్టర్: డ్రైవర్ మృతి



సంఘటనా స్థలంలో మృతి చెందిన డ్రైవర్ చిన్నయ్య

బంగారుపాళెం: మండలంలోని మడుపోలూరు వద్ద ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు. ఆయన కథనం మేరకు, మడుపోలూరు నుంచి వసంతాపురానికి మట్టిని తరలిస్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న మడుపోలూరుకు చెందిన చిన్నయ్య(70) కింద పడ్డాడు. ఆయన మీద ట్రాలీలోని మట్టి పడడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

క్వారీ గుంతలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన చంద్రశేఖర్

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు, చిత్తూరు పట్టణం గ్రీమ్స్ పేటకు చెందిన చంద్రశేఖర్(36) రెండు రోజుల క్రితం గంగాధరనెల్లూరులో మద్యం తాగాడు. అనంతరం ఈత కొట్టేందుకు క్వారీ గుంతలో దిగాడు. అయితే మత్తులో ఉండడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలో ఆదివారం ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు సీఐ భాస్కర్, ఎస్‌ఐ రమేష్ తన బృందంతో కలిసి బెట్టింగ్‌పై నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే యువరాజు, ముత్తు, ప్రవీణ్, సహజాన్ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1,50,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చూపించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



బావిలో గాలిస్తున్న ఫైర్ సిబ్బంది, ఇన్‌సెట్ మనోజ్(ఫైల్)



సోమల: ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లెకు చెందిన ప్రభు, మహాలక్ష్మి దంపతుల కుమారుడు మనోజ్(9) గంగిరెడ్డిపురం సమీపంలోని బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. తండ్రి చుట్టుపక్కల వారి సాయంతో ఎంత వెతికినా కనబడక పోవడంతో రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన తహసీల్దార్ పుంగనూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి బావిలో పాతాలభైరవి సహాయంతో వెతికారు. రాత్రి 8.45 గంటల సమయంలో బాలుడి మృతదేహాన్ని ఫైర్ సిబ్బంది వెలికి తీశారు. బాలుడి మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైకుంఠపురంలో చోరీ

తిరుపతి రూరల్ : ముత్యాలరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైకుంఠపురం వద్ద ఓ ఇంట్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. కాలనీకి చెందిన రెడ్డికుమార్ వ్యక్తిగత పనులు మీద గురువారం సాయంత్రం రాయచోటికి వెళ్లాడు. అయితే అర్ధరాత్రిలో ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు బీభత్సం సృష్టించారు. ఉదయం ఇంటికి వచ్చిన పనిమనిషి చోరీ విషయం గుర్తించి, రెడ్డికుమార్‌కు సమాచారం అందించింది. బీరువాలోని 40 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి , రూ.15 వేల నగదు, సోనీ కెమెరాను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితుడు రెడ్డికుమార్ తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మూర్తి తెలిపారు.

శాస్త్రోక్తంగా హోమ పూజలు



ఆలయంలో హోమ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ, విమాన గోపుర కలశ మహా సంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం హోమ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాజశేఖర దీక్షితుల ఆధ్వర్యంలో వేదపండితులు గణపతి ప్రార్థన, పుణ్యాహవాచనం, గోపూజ, రక్షాబంధనం, పంచగవ్య, కలశరాధన, అగ్ని ప్రతిష్టాపన, గణపతి హోమం, రుద్రహోమం, దేవి హోమం, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



సదుం: నేలకొరిగిన విద్యుత్ స్తంభం



నేలరాలిన మామిడి

సదుం: మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలో పలు చోట్ల మామిడి, టమాటా పంటలకు నష్టం చేకూరింది. కంభంవారిపల్లెలో నష్టం అధికంగా ఉన్నట్టు గ్రామస్తులు, రైతులు తెలిపారు. పంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కురవపల్లెకు చెందిన నాగమల్లయ్య, రామనాథ గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గాండ్లపల్లె పాఠశాల ప్రహరీ గోడ దెబ్బతింది. కంభంవారిపల్లె పంచాయతీ చెనకవారిపల్లెకు చెందిన నాగేశ్వర ఇంటిపై కప్పుగా వేసిన సిమెంటు రేకులు పడి ఆయన కుమార్తె సావిత్రి(9) స్పృహ కోల్పోవడంతో పీలేరుకు తరలించారు.

గాలీవానకు నేల రాలిన మామిడి

రొంపిచెర్ల: మండలంలో ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సానికి వందల ఎకరాల్లో మామిడి పంట నేల రాలింది. ఒక్క సారిగా పెద్ద ఎత్తున వడగండ్ల వర్షం పడడంతో మామిడి తోటల్లో కాయలన్నీ నేల రాలాయి. బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీల్లో మామిడి పంట తీవ్రంగా నష్టపోయింది.

కుప్పంలో ఆధ్యాత్మిక సందడి



అమ్మవారి ఊరేగింపు



వైజాగ్ బృందం నృత్యం

కుప్పం: కుప్పంలో తిరుపతి గంగమ్మ జాతర సంబరాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చి పొంగళ్లుపెట్టి అమ్మవారికి నివేదించారు. అశ్వ వాహనంపై ముత్తమారెమ్మ ఉత్సవ మూర్తులను పలకవాయిద్యాల మధ్య పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వైజాగ్ సినీ డాన్స్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. వారం రోజులుగా అమ్మవారి జాతరతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నేడు అగ్ని గుండప్రవేశం

జాతర వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి ముత్తమారెమ్మ శిరస్సు అగ్నిగుండ ప్రవేశం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 54 పుష్ప పల్లకిల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించనున్నారు. బాణసంచా వేడుకలు, నయ్యాండి నృత్య ప్రదర్శనలు ఉంటాయనిఆలయ కమిటీ తెలిపింది.